
సాక్షి
గుంటూరు
శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025




ఫిరంగిపురంలో ఫీవర్ సర్వే

ఫిరంగిపురం: ఫిరంగిపురంలోని విజ్ఞానపురంలో గురువారం ఆరోగ్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక ఫీవర్ సర్వే నిర్వహించారు. సీహెచ్‌వో వెంకటరమణ పాల్గొన్నారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 32,662 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 41,055 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ సమాచారం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 589.80 అడుగులకు చేరింది. ఇది 311.4474 టీఎంసీలకు సమానం.

ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక మీడియాపై దాడి



ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన చూస్తుంటే అందరికీ భయం వేస్తోంది. పోలీసు రాజ్యం మినహా ప్రజారాజ్యం నడుస్తున్నట్లు కనిపించడం లేదు. సాక్షి ఎడిటర్‌తోపాటు మరి కొందరిపై తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో నమోదు చేసిన అక్రమ కేసులు విచారణ చేయడం చాలా విడ్డూరంగా ఉంది. ఎల్లో మీడియా తమ అవసరం కోసం ప్రభుత్వ లోపాలు ఎత్తి చూపుతూ వార్తలు రాస్తే కేవలం రిజాయిండర్ లేదా వివరణ మాత్రమే అడుగుతున్నారు. చంద్రబాబు పర్యవేక్షణలోని సూర్య ఘర్‌పై వారు వార్తలు రాస్తే ఖండన మాత్రమే ఇచ్చారు. సాక్షి పత్రిక అమరావతికి సంబంధించి ప్రెస్ కాన్ఫరెన్స్ వార్తను మాత్రమే రాస్తే ఎడిటర్‌కు నోటీసులు ఇవ్వటాన్ని చూస్తుంటే పత్రికా స్వేచ్ఛను హరించాలనే తాపత్రయమే కనిపిస్తోంది. ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక మీడియాపై దాడి చేస్తున్నారు.

– మేరుగు నాగార్జున,
మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు

పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం



రాజ్యాంగం కల్పించిన హక్కలను కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పాలనలో కాలరాస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఫోర్త్ ఎస్టేట్ అయిన మీడియాపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. రాజకీయ నాయకుడి మీడియా సమావేశాన్ని ప్రచురించినందుకు సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసు నమోదు చేయడం దుర్మార్గం. ఇది పత్రికా స్వేచ్ఛను కాలరాయడమే. ఏపీలో ప్రజలకు, మీడియాకు వాక్ స్వాతంత్ర్య హక్కు లేకుండా చేస్తున్నారు. ప్రజల సమస్యలపై పోరాడే మీడియాపై కక్షసాధింపు చర్యలను కూటమి ప్రభుత్వం మానుకోవాలి. సాక్షి ఎడిటర్, ఇతర రిపోర్టర్లపై నమోదు చేసిన అక్రమ కేసులన్నింటినీ ఎత్తివేయాలి.

– విడదల రజిని, మాజీ మంత్రి



ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న పాలకులు



కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాజ్యాంగ విలువను ఖూనీ చేస్తున్నారు. మీడియాను సైతం భయపెట్టేలా వ్యవహరించటం సిగ్గుచేటు. ఏదైనా కథనాన్ని ప్రచురించినప్పుడు అందులో తప్పులుంటే న్యాయబద్ధంగా పోరాటం చేయాలి. అంతేగానీ అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేయటం భావ్యం కాదు. అసలు ప్రెస్‌మీట్ పెట్టి ప్రభుత్వ విధానాలను ప్రతిపక్ష నేతలు ఎండగడితే.. దానిలో సాక్షి, ఎడిటర్, పలువుర్ని భాగస్వాములను చేస్తూ కేసులు నమోదు చేసే వింత పోకడలను నా 30 ఏళ్ల రాజకీయ చరిత్రలో చూడలేదు. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని.. అక్రమ కేసులతో ప్రజాస్వామ్య బద్ధమైన మీడియాను ఆపలేరన్న విషయాన్ని గుర్తించాలి.

– అంబటి రాంబాబు, మాజీ మంత్రి,
వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు

అంతుచిక్కని మాయదారి రోగం

- తురకపాలెంలో వరుస మరణాలపై వీడని మిస్టరీ
- ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేసిన అధికారులు
- ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యాన్ని ఆర్‌ఎంపీలపై నెట్టే ప్రయత్నమా ?
- పది రోజులుగా బ్లడ్ శాంపిల్స్ పరీక్షలు రాకపోవటంపై ప్రజల్లో అనుమానాలు
- బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేనా?
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం



తురకపాలెం గ్రామ వ్యూ

గుంటూరు రూరల్: మండలంలోని తురకపాలెంలో వరుస మరణాల మిస్టరీ ఇంకా తేలలేదు. ప్రభుత్వ తాత్సారంతో గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. ఇటు ప్రజల్లోనూ అనేక అపోహలు నెలకొన్నాయి. బొడ్డురాయి పూజలు, గౌతు రాయిని సరి చేయడం కార్యక్రమాలను గ్రామ పెద్దలు నిర్వహించారు. అయినా, పరిస్థితిలో మార్పులేదు. గ్రామస్తులు జ్వరాలతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఆరుగురు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వారం రోజులుగా చికిత్సలు పొందుతూనే ఉన్నారు.

మెలియాయిడోసీస్‌గా ప్రైవేటు వైద్యులు నిర్ధారణ

గ్రామంలో మెలియాయిడోసీస్‌తో పలువురు తమ ఆసుపత్రుల్లో చికిత్స పొందారని ప్రైవేటు వైద్యులు బాహటంగానే చెప్పారు. కొందరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంకా చికిత్స పొందుతున్నారు. గత వారం రోజులుగా గ్రామంలో రాష్ట్ర, నేషనల్ స్థాయి వైద్య బృందాలు పర్యటించి శాంపిల్స్ సేకరిస్తూనే ఉన్నాయి. గ్రామస్తుల నుంచి రక్తాన్ని తీసుకుని వెళుతున్నారే కానీ వాటి ఫలితాలను మాత్రం వెల్లడించలేదు. నేటికి వ్యాధి నిర్ధారణ కాలేదనే ప్రభుత్వ వైద్యులు చెబుతున్నారు. తమ అనుమానాలను నివృత్తి చేసే ఆలోచన ప్రభుత్వానికి, వైద్యులకు ఉందా.. లేదా ? అనే సంశయమం గ్రామస్తుల్లో నెలకొంది. నిత్యం ఇదే చర్చాంశనీయంగా మారింది.



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ఆర్‌ఎంపీపై మరణాల భారం

గ్రామంలో వరుస మరణాల్లో పలువురు సమీపంలోని ఒక ఆర్‌ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స పొందారు. అతడు అధిక మోతాదులో యాంటీబయాటిక్స్ వినియోగిస్తూ, కలుషిత సెలైన్స్ వినియోగించటం వల్ల ఇన్‌ఫెక్షన్లకు గురై కొందరు మృత్యువాతకు గురైనట్లు అనుమానంతో జిల్లా వైద్యాధికారులు క్లినిక్‌ను సీజ్ చేశారు. అయితే, అదే ఆర్‌ఎంపీ వద్ద సమీప గ్రామాలకు చెందిన మల్లవరం, పెద్దపలకలూరు, చిన్నపలకలూరు, తోకావారిపాలెం, జన్మభూమినగర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు చికిత్సలను పొందారు. ఆర్‌ఎంపీ అత్యధిక మోతాదులో మెడిసిన్ రోగులకు వినియోగిస్తే ఇతర గ్రామాల ప్రజలకు ఎందుకు ఇన్‌ఫెక్షన్లు సోకలేదు ? కేవలం ఆర్‌ఎంపీ చేసిన తప్పు వల్లే మరణాలకు గురయ్యారనటం సబబేనా? అని గ్రామాల్లో ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉంటే అనారోగ్యంతో మృత్యువాతకు గురైన వారిలో ఇతర ఆసుపత్రుల్లో చికిత్సలు పొందినవారు ఉన్నారు. మరి ఆయా ఆసుపత్రులను వదిలి, ఆర్‌ఎంపీ క్లినిక్‌పైనే చర్యలు తీసుకోవటం ఏంటి? ఇంకా ఆ గ్రామం సమీప గ్రామాల్లో ఆర్‌ఎంపీలు లేరా? అనే విషయాలపై గ్రామస్తులు తీవ్రంగా చర్చించుకుంటున్నారు.



మెడికల్ క్యాంపులో పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

బయటకురాని రక్త పరీక్షల వివరాలు

గ్రామంలో రాష్ట్ర, జాతీయ స్థాయి సంస్థలు పలు బృందాలుగా గ్రామంలో జ్వర పీడితుల నుంచి బ్లడ్ శాంపిల్స్ సేకరించాయి. వాటి ఫలితాలు నేటికి తెలియకపోవటం శోచనీయం. పది రోజులుగా గ్రామంలో మెడికల్ క్యాంపులు జరుగుతూనే ఉన్నాయి. వరుస మరణాలకు కారణం ఏంటని రాష్ట్ర ప్రభుత్వం కానీ, వైద్యా ఆరోగ్యశాఖ కానీ నేటికీ నిర్ధారించకపోవటం గ్రామ ప్రజల్లో పలు ఆలోచనలను రేకెత్తిస్తోంది.

ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు

బాధితులు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రిలో లక్షల రూపాయల అప్పులు చేసి తమ కుటుంబ సభ్యులను బతికించుకునే ప్రయత్నం చేశారు. డబ్బులు పోగా అనారోగ్యాలకు గురైనవారిని కోల్పోయారు. ప్రతి ఇంటిలో పెద్దను కోల్పోయి, నేడు ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్నారు. బాధిత కుటుంబాలు రాష్ట్ర ప్రభుత్వం నేటికి ఆర్థిక సాయం ప్రకటించలేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆదుకోవాలని కోరుతున్నారు.

న్యూస్‌రీల్

పశ్చిమ డెల్టాకు 6,522 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 6,522 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద 12 అడుగులు నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 180 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్ 1,736, తూర్పు కాలువకు 637, పశ్చిమ కాలువకు 226, నిజాపట్నం కాలువకు 432, కొమ్మూరు కాలువకు 2,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. బ్యారేజ్ నుంచి సముద్రంలోకి 36,250 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉపాధ్యాయుల నిరసన



గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్థిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గురువారం జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధ్యాయులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. బసవలింగారావు, మొహమ్మద్ ఖాలీద్ మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక డిమాండ్లలో ప్రభుత్వ సాచివేత ధోరణికి వ్యతిరేకంగా నిరసన వారం ఉద్యమ కార్యాచరణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వందలాది మంది ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలను ధరించి, ప్రదర్శనలు నిర్వహించారని తెలిపారు. శుక్రవారం అన్ని మండల కేంద్రాల్లో ప్రదర్శనలు నిర్వహించి, తహసీల్దార్లకు వినతి పత్రాలు సమర్పించనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

తెనాలిలో డెంగీ కలకలం

తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలో అధికారికంగా డెంగీ కేసు నమోదైంది. ఈ విషయం బయటకు రావడంతో పట్టణంలో కలకలం మొదలైంది. తెనాలి 17వ వార్డుకు చెందిన 60 సంవత్సరాల వ్యక్తి అనారోగ్యంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం కొద్దిరోజుల కిందట వెళ్లాడు. అతడిలో డెంగీ లక్షణాలు కనిపించడంతో వెంటనే వైద్యులు రక్త పరీక్షలు చేయించడంతో వ్యాధి నిర్ధారణ అయింది. విషయాన్ని ప్రభుత్వ వైద్యశాల అధికారులు తెనాలి మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వ్యక్తి నివసించే ప్రాంతంలో మురుగు కాల్వలను బాగు చేయించి బ్లీచింగ్, స్ప్రేయింగ్ చేయిస్తున్నారు.

డీఎల్‌డీవో కార్యాలయ పనులు పూర్తి చేయాలి



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని డీఎల్‌డీవో కార్యాలయ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ అన్నారు. గుంటూరు రోడ్‌లోని అయ్యప్పస్వామి దేవాలయం పక్కన గల పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌ను సత్తెనపల్లి డీఎల్‌డీవో కార్యాలయానికి ఇటీవల కేటాయించారు. దీంతో గురువారం ఆయన దానిని పరిశీలించారు. కార్యాలయంలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రూ. 10 లక్షలు కేటాయించాల్సిందిగా సీఈఓకు సూచించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్, సత్తెనపల్లి డీఎల్‌డీవో బి.రాజగోపాల్, సత్తెనపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవో షేక్ రెహామాన్, పంచాయతీ రాజ్ ఏఈ కె.రామ్‌మోహన్ సింగ్ పాల్గొన్నారు.

సాక్షి మీడియాపై కూటమి కక్ష సాధింపు

డీఎస్పీల ప్రమోషన్ పెండింగ్ కథనంపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

- విచారణకు హాజరైన ఎడిటర్ ధనంజయరెడ్డితో పాటు విశ్వనాథరెడ్డి, శ్రీనివాస్
- గంటన్నర సేపు కొనసాగిన విచారణ

మంగళగిరి టౌన్ : జనం పక్షాన నిలిచిన కలంపై కూటమి ప్రభుత్వం కత్తికట్టింది. 15 నెలల పాలనలో వరుస కుంభకోణాలు, వంచనలు తప్పా చేసింది ఏమీ లేదని బట్టబయలు అవుతున్నకొద్దీ దిక్కుతోచని పరిస్థితుల్లో 'సాక్షి'పై అక్రమ కేసులతో రెచ్చిపోతోంది. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి, స్టేట్ బ్యూరో ఇన్‌చార్జి విశ్వనాథరెడ్డి, స్టేట్ క్రైం ఇన్‌చార్జి వడ్డాది శ్రీనివాస్‌లపై ఏపీ ప్రభుత్వ ప్రోద్బలంతో పోలీసులు అక్రమ కేసులు పెట్టి, సాక్షి కార్యాలయానికి వచ్చి మరీ నోటీసులు అందించిన విషయం విదితమే. డీఎస్పీల ప్రమోషన్ల పెండింగ్ కథనంపై ఎడిటర్, స్టేట్ బ్యూరో ఇన్‌చార్జి, స్టేట్ క్రైమ్ ఇన్‌చార్జిలపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేశారు. దీంతో వీరు ముగ్గురు గురువారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో భారీస్థాయిలో సాక్షి జర్నలిస్టులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సంఘీభావం ప్రకటించారు. ఈ కేసుతో పాటు ఎడిటర్ ధనంజయరెడ్డిని మరో రెండు కేసుల్లో విచారించామని సీఐ వీరేంద్రబాబు తెలిపారు. విచారణకు హాజరైన వారికి సంఘీభావం తెలుపుతూ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, అమరా నాగయ్య, మంగళగిరి రూరల్ అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ, మంగళగిరి నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు కె. సునీల్ కుమార్, నాయకులు వివేకానందరెడ్డి, గులామ్ రసూల్, పానుగంటి చైతన్య, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు తాడేపల్లి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు.

పల్నాడు జిల్లా కలెక్టర్‌గా కృతిక శుక్లా నియామకం



సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా కలెక్టర్‌గా 2013వ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి కృతికా శుక్లా నియమితులయ్యారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను జిల్లాకు కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం జీఓ జారీ చేసింది. జమ్మూ అండ్ కశ్మీర్ రాష్ట్ర కేడర్‌కు చెందిన కృతికా శుక్లా తన బ్యాచ్‌కే చెందిన ఏపీ క్యాడర్ ఐఏఎస్ అధికారి హిమాన్షు శుక్లాను వివాహం చేసుకొని ఏపీ క్యాడర్‌కు బదిలీ అయ్యారు. కృతిక శుక్లా 2016 నవంబర్ 11వ తేదీ నుంచి 2018 ఆగస్టు 12వ తేదీ వరకు ఉమ్మడి గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. విశాఖపట్నం అసిస్టెంట్ కలెక్టర్, మదనపల్లి సబ్ కలెక్టర్, ఉమ్మడి కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గానూ విధులు నిర్వహించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్; దిశా స్పెషల్ ఆఫీసర్, కాకినాడ కలెక్టర్, ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ తదితర హోదాలలో పనిచేశారు.

అరుణ్‌బాబుకు దక్కని పోస్టింగ్

గత ఏడాది కాలంగా జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న పి.అరుణ్‌బాబుకు తాజా బదిలీలలో పోస్టింగ్ ఇస్తున్నట్లు జీఓలో పేర్కొనలేదు. గతంలో నరసరావుపేట, గురజాల ఆర్డీఓగా పనిచేసిన అరుణ్‌బాబు 2024 ఆగస్టు 7వ తేదీన పల్నాడు జిల్లా మూడవ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. పీజీఆర్‌ఎస్‌కు వచ్చే అర్జీదారుల కోసం కలెక్టర్ ప్రాంగణంలో ప్రత్యేక షెడ్ ఏర్పాటు చేయించారు. ఉచితంగా అర్జీలు రాసిచ్చే ప్రక్రియను చేపట్టారు. ప్రతి మూడో శనివారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక పీజీఆర్‌ఎస్ నిర్వహిస్తూ వారి సమస్యలు తీర్చేందుకు ప్రయత్నాలు చేశారు. కలెక్టరేట్‌కు దగ్గరలో పరేడ్ గ్రౌండ్ ఏర్పాటులో కూడా కీలక పాత్ర పోషించారు. శంకరభారతీపురం జెడ్పీ హైస్కూలును దత్తత తీసుకున్నారు.

గుంటూరు జిల్లా కలెక్టర్‌గా తమీమ్ అన్సారియా



గుంటూరు వెస్ట్: గుంటూరు జిల్లా కలెక్టర్‌గా 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన తమీమ్ అన్సారియాను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తమిళనాడుకు చెందిన ఆమె ఇప్పటి వరకు ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. జిల్లా కలెక్టర్‌గా ఇప్పటి వరకు పనిచేసిన ఎస్. నాగలక్ష్మిని జీఏడీలో రిపోర్ట్ చేయమని ఆదేశించారు. ఇటీవలే జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవను గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు. జిల్లాకు నూతన కలెక్టర్, జేసీల కాంబినేషన్‌లో పాలన కొనసాగనుంది. 38 ఏళ్లలో జిల్లాకు మూడో మైనారిటీ వర్గానికి చెందిన కలెక్టర్ వచ్చారు. 1987లో జన్నత్ హుస్సేన్ పనిచేయగా 2007 లో మొహమ్మద్ ఆలీ రఫత్‌ను జిల్లా కలెక్టర్‌గా అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నియమించారు. మళ్లీ జిల్లాకు మైనారిటీ వర్గానికి చెందిన కలెక్టర్ రావడం గమనార్హం.

బాపట్ల జిల్లా కలెక్టర్‌గా వినోద్‌కుమార్ నియామకం



సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా కలెక్టర్‌గా వి.వినోద్ కుమార్ నియమితులయ్యారు. అనంతపురం కలెక్టర్‌గా ఉన్న ఆయనను బాపట్లకు బదిలీ చేస్తూ గురువారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2015 ఐఏఎస్ క్యాడర్‌కు చెందిన వినోద్‌కుమార్ ఏప్రిల్ 2024లో అనంతపురం కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. కర్ణాటకు చెందిన వినోద్ కుమార్ డాక్టర్ చదువు పూర్తి చేసి 2015లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. 2016 – 17లో అనంతపురం అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశారు. 2017– 19లో రంపచోడవరం సబ్ కలెక్టర్, 25 జూన్ 2019 నుంచి 17 సెప్టెంబరు 2019 వరకు ఐటీడీఏ పార్వతీపురం, 11 మే 2020 నుంచి 11 ఆగస్టు 2020 వరకు నెల్లూరు అడిషనల్ జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. 2020– 23లో ఏపీ హెల్త్ సిస్టం స్ట్రెంతెనింగ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా వ్యవహరించారు. 12 ఏప్రిల్ 2023 నుంచి 4 ఏప్రిల్ 2024 వరకు స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. 9 జూలై 2024న బాపట్ల కలెక్టర్‌గా వచ్చిన జె.వెంకట మురళిని ఏడాది తర్వాత ప్రభుత్వం బదిలీ చేసింది.

తురకపాలెం మరణాలపై జెడ్పీలో చర్చ

అంతుచిక్కని మరణాలపై వైద్యారోగ్య శాఖాధికారుల నుంచి చైర్‌పర్సన్ వివరాలు సేకరణ



సమావేశాన్ని నిర్వహిస్తున్న హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో మరణాలపై జెడ్పీ స్థాయి సంఘ వేదికగా చర్చ జరిగింది. సమావేశ మందిరంలో గురువారం సంఘాలు భేటీ అయ్యాయి. మొత్తం ఏడు స్థాయి సంఘాలకు గానూ మూడు సంఘ సభ్యులు గైర్హాజరుతో కోరం లేక వాయిదా పడింది. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అధ్యక్షతన 1,2,4,7వ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తురకపాలెంలో చోటు చేసుకున్న మరణాలపై వైద్యారోగ్యశాఖాధికారుల నుంచి వివరాలు సేకరించారు. పల్నాడు జిల్లాలో ఒక కేసు నమోదైనట్లు అధికారులు సమావేశం దృష్టికి తెచ్చారు. తాగునీటి పంపిణీకి పంపిణీకి సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకున్నారని రూరల్ వాటర్ వర్క్స్ ఎస్ఈ కల్యాణ్ చక్రవర్తిని హెనీ క్రిస్టినా ప్రశ్నించగా, తగు జాగ్రత్తలు తీసుకున్నామని ఆయన తెలిపారు. అనంతరం ప్రణాళిక, ఆడిట్, గ్రామ పంచాయతీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, గ్రామీణ నీటి సరఫరా పారిశుద్ధ్యం, రహదారులు భవనాలు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ట్రెజరీ, స్టాంపులు రిజిస్ట్రేషన్ ,రవాణా శాఖ, గనులు భూగర్భ వనరుల శాఖ, భూగర్భ జల వనరుల శాఖ, గృహ నిర్మాణ సంస్థ, సహకార శాఖ, కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్, గ్రామీణ పరిశ్రమల మండలి, పరిశ్రమల శాఖ, ప్రణాళిక శాఖ, ఉపాధి కల్పన శాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థల వారీగా వివిధ అంశాలపై చర్చించారు. పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ మాట్లాడుతూ జిల్లా పరిషత్తు ఆధ్వర్యంలో ముద్రించిన విద్యాజ్యోతి పుస్తకం వల్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని 599 మార్కులు సాధించిందని తెలిపారు. 577 మార్కులు సాధించిన విద్యార్థులు 100 మందికి పైగా ఉన్నారని వివరించారు. గుంటూరు జిల్లా డీఈఓ సీవీ రేణుక మాట్లాడుతూ విద్యార్థులకు యూనిఫాంతో పాటు మెరుగైన భోజనాన్ని అందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వి.జ్యోతి బసు, ఓఎస్డీ పి.శివన్నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ నిర్వాకం.. బాధ్యతారాహిత్యం !

- అర్ధంతరంగా పీజీ సెట్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వాయిదా
- దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు అవస్థలు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోగో

గుంటూరు: ఏపీ పీజీ సెట్ నిర్వహణలో ఆది నుంచి జాప్యం చేస్తూ వచ్చిన ఉన్నత విద్యాశాఖ అధికారులు చివరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లోనూ విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది కలిగించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జూలైలో ఏపీ పీజీ సెట్ నిర్వహించారు. వారం పది రోజుల్లోపే ర్యాంక్ కార్డులను విడుదల చేశారు. ఆ తర్వాత రెండు నెలల పాటు అడ్మిషన్లపై ఎలాంటి ప్రకటన విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు నిరీక్షణ తప్పలేదు. ఎట్టకేలకు ఈనెల 8న విడుదల చేశారు. 8 నుంచి 15 వరకు వెబ్ కౌన్సెలింగ్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 9 నుంచి 16 వరకు ఆన్‌లైన్ ద్వారా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని ప్రకటించారు. దీంతోపాటు స్పెషల్ కేటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 11న గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని నోటిఫికేషన్‌లో తెలిపారు. దీని ఆధారంగా ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, చిల్డ్రన్ ఆఫ్ ఆర్మ్‌డ్ పర్సన్ (క్యాప్), దివ్యాంగులు తదితర కేటగిరీలకు చెందిన వందలాది మంది విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో గురువారం నాగార్జున విశ్వవిద్యాలయానికి చేరుకున్నారు. తీరా అక్కడికి వచ్చిన తర్వాత కార్యక్రమాన్ని వాయిదా వేశామని, బుధవారం సాయంత్రం తమ వెబ్ సైట్ ద్వారా తెలియపరచామని యూనివర్సిటీ అధికారులు పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలకు ఓర్చి అక్కడికి చేరుకున్న విద్యార్థులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

అధికారులతో వాదనకు దిగిన విద్యార్థులు

యూనివర్సిటీ అధికారులు వెబ్‌సైట్‌లో ప్రకటించిన విషయాన్ని గుర్తించలేదని, ఇప్పుడు ఉన్నపళంగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వాయిదా వేస్తున్నామని చెప్పి వెనక్కు పంపడం తగదని విద్యార్థులు అధికారులతో వాదనకు దిగారు. దివ్యాంగుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం జీజీహెచ్ వైద్యాధికారులు అందుబాటులో లేరని, అందువల్ల వాయిదా వేస్తున్నామని అధికారులు చెప్పుకొచ్చారు. అలాంటప్పుడు దివ్యాంగుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మాత్రమే వాయిదా వేయాలి గానీ, మిగిలిన వారివి యథావిధిగా నిర్వహించకపోవడంలోని ఆంతర్యం ఏమిటని విద్యార్థులు ప్రశ్నించారు. అన్ని ఒకేసారి నిర్వహించడం వల్ల తమకు సులువుగా ఉంటుందని, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఎప్పుడు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని అధికారులు చెప్పిన సమాధానం ఆశ్చర్యం కలిగించింది. దూర ప్రాంతం నుంచి వచ్చిన తమను ఇలా ఇబ్బందులకు గురి చేయడం భావ్యం కాదని, మళ్లీ రావాలంటే ఎంతో కష్టంతో కూడుకున్న పని అని, సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగించాలని విద్యార్థులు చేసిన విజ్ఞప్తిని అధికారులు పట్టించుకోలేదు. హాజరైన విద్యార్థుల నుంచి అధికారులు మొక్కుబడిగా వారి పేర్లు, హాల్ టికెట్ నంబర్, ర్యాంక్, ఫోన్ నంబర్ తదితర వివరాలు నమోదు చేసుకున్నారు. దాదాపు 100 మంది వరకు విద్యార్థులు అక్కడ తమ పేర్లు నమోదు చేసుకున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వాయిదా వేశారనే విషయం తెలుసుకుని ఆలస్యంగా వచ్చిన చాలామంది విద్యార్థులు నిరాశతో వెనుదిరిగారు. మొత్తానికి యూనివర్సిటీ అధికారుల వైఖరి కారణంగా పీజీ సెట్ విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,400 గరిష్ఠం : రూ. 3,200

మోడల్ ధర రూ. 2,800



పసుపు ధరలు

(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 396

కొమ్ములు : 319 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,800	10,300	10,300

కాయలు : 77 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,800	10,300	10,300

మొత్తం అమ్మకాలు : 297.00 క్వింటాళ్లు

–దుగ్గిరాల

నైపుణ్యంతోనే పోటీ ప్రపంచంలో రాణింపు

- ఏఎన్‌యూ వర్సిటీ వీసీ ఆచార్య కె. గంగాధరరావు
- వేడుకగా 49వ వ్యవస్థాపక దినోత్సవం



స్వర్ణోత్సవ వేడుకల లోగోను ఆవిష్కరిస్తున్న పూర్వ వైస్ చాన్సలర్లు, వర్సిటీ అధికారులు

పెదకాకాని(ఏఎన్‌యూ): నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలని వర్సిటీ వీసీ ఆచార్య కె. గంగాధరరావు సూచించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 49వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం వేడుకగా జరిగింది. అతిథులు, యూనివర్సిటీ అధికారుల జ్యోతి ప్రజ్వలన అనంతరం విశ్వవిద్యాలయ స్వర్ణోత్సవ లోగో ఆవిష్కరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల, దేశ ప్రగతికి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయానికి వృత్తి విద్య కళాశాలలు ఆర్థిక స్థిరత్వం తెచ్చిపెట్టాయని చెప్పారు. అమరావతి ప్రాంతంలో ఉన్న ప్రైవేటు యూనివర్సిటీలను దీటుగా ఏఎన్‌యూ ఎదుర్కొనేలా ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. రాబోయే పదేళ్లలో అమెరికా, చైనాను మించి భారత్ ప్రగతి సాధించే అవకాశం కనిపిస్తోందని, దీనికి విద్యార్థుల కృషి కూడా అవసరమని తెలిపారు. 1976లో ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పడిన శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీల కంటే నాగార్జున యూనివర్సిటీ ఎంతో ప్రగతిని సాధించిందని చెప్పారు. అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన రెక్టర్ ఆచార్య రత్న షీలామణి మాట్లాడుతూ రాబోయే ఏడాది కాలం పాటు స్వర్ణోత్సవ వేడుకలు కొనసాగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవాల లోగో ప్రత్యేకతను వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ పూర్వ ఉప కులపతుల దూరదృష్టి విశ్వవిద్యాలయ అభివృద్ధికి దోహద పడిందని కొనియాడారు. విశ్వవిద్యాలయ అభివృద్ధి ఫలాలు వారి కృషి, పట్టుదల, దార్శనికానికి నిదర్శనం అన్నారు.

పండుగ వాతావరణం

మేధావులు, ఆచార్యులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పరిశోధకుల సందడితో పండుగ వాతావరణంలో వర్సిటీ ప్రాంగణం నిలిచింది. అనంతరం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతులు గా విశిష్ట సేవలు అందించిన ప్రొఫెసర్ డి. రామకోటయ్య, ప్రొఫెసర్ సి.వి. రాఘవులు, ప్రొఫెసర్ ఎల్. వేణుగోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ వి. బాలమోహన్‌దాస్, ప్రొఫెసర్ వై.ఆర్. హరగోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ ఏ. రాజేంద్రప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. ముందుగా ప్రొఫెసర్లు తమ అమూల్యమైన సందేశాలను అందించారు.

ఉత్తమ అధ్యాపకులకు సన్మానం

ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డులు పొందిన విశ్వవిద్యాలయ అధ్యాపకులు ప్రొఫెసర్ జి. చెన్నారెడ్డి, ప్రొఫెసర్ పి.పి.ఎస్. పాల్ కుమార్, ప్రొఫెసర్ వి. దివ్య తేజ మూర్తి, ప్రొఫెసర్ రమేష్ రాజు, డాక్టర్ పి. సుధాకర్‌లను సత్కరించారు.కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య వీరయ్య, ఆచార్య సురేష్ కుమార్, ప్రొఫెసర్ లింగరాజు, ప్రొఫెసర్ ప్రమీలారాణి, ప్రొఫెసర్ పాల్ కుమార్, పాలకమండల సభ్యులు ప్రొఫెసర్ సుమంత్ కుమార్, ప్రొఫెసర్ జగదీష్ నాయక్, ఓఎస్‌డీ ఆచార్య రవికుమార్, సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వి. వెంకటేశ్వర్లు, రూసా డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. మురళీమోహన్, సీడీసీ డీన్ ఆచార్య వి. రవికుమార్, సీడీఈ పరీక్షలు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రామచంద్రన్, యూజీ పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్.వి. కృష్ణారావు, నూట అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ బ్రహ్మాజీరావు, ప్రొఫెసర్ త్రిమూర్తిరావు, వికాస అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, శ్రీనివాసరావు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంటూరు తూర్పులో 116.2 మిల్లీమీటర్ల వర్షం

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకూ అత్యధికంగా గుంటూరు తూర్పులో 116.2 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది. అత్యల్పంగా పొన్నూరు మండలంలో 3.4 మిల్లీ మీటర్ల నమోదైంది. సగటున 29.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. గుంటూరు పశ్చిమలో 99.5 మిల్లీ మీటర్లు, పెదకాకాని 61, దుగ్గిరాల 52.8, చేబ్రోలు 42, ఫిరంగిపురం 38.2, తెనాలి 36.2, వట్టిచెరుకూరు 34.6, పత్తిపాడు 18, పెదనందిపాడు 1.2, తుళ్లూరు 8.8, మేడికొండూరు 4.4, కాకుమాను మండలంలో 4 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

మిర్చి యార్డు సమాచారం

(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	41,942
అమ్మకాలు	45,984
నిల్వ	11,052

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–14,300
నంబరు–5	10,000–13,500
273	10,500–13,500
341	10,000–15,200
4884	10,000–14,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,500
నంబరు–5	10,000–13,600
341	11,000–15,400

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,200
బాడిగ–355	10,000 – 15,800
దేవనూరు డీలక్స్	10,000 – 14,200
ఆర్మూర్	9,800 – 12,500
తాలుకాయలు	6,200 – 7,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–15,000
బాడిగ – 355	10,000–15,700
దేవనూరు డీలక్స్	10,500–14,500
తాలు	5,200 – 7,200

–కొరిటెపాడు (గుంటూరు)

కొరియన్ కంపెనీల్లో విస్తృత అవకాశాలు

- చెన్నైలోని కౌన్సిల్ జనరల్ ఆఫ్ ద రిపబ్లిక్ ఆఫ్ కొరియా చాంగ్ న్యూన్ కిమ్
- విజ్ఞాన్ వర్సిటీలో ఘనంగా కొరియన్ ఫిల్మ్స్ ఫెస్టివల్



మాట్లాడుతున్న చాంగ్ న్యూన్ కిమ్

చేబ్రోలు: కొరియన్ భాషలో ప్రావీణ్యం సాధించడం ద్వారా భారత విద్యార్థులు, యువతకు కొరియన్ కంపెనీలలో విస్తృత అవకాశాలను పొందవచ్చని చెన్నైలోని కౌన్సిల్ జనరల్ ఆఫ్ ద రిపబ్లిక్ ఆఫ్ కొరియా చాంగ్–న్యూన్ కిమ్ ఆశాభావం వ్యక్తం చేశారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో గురువారం కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చాంగ్ న్యూన్ కిమ్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ దేశాల మధ్య నెలకొన్న పోటీ పరిస్థితుల్లో ఆసియా ఖండంలో భారతదేశం, కొరియాలు కీలక భాగస్వాములని పేర్కొన్నారు. భద్రతా రంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రజల మధ్య పరస్పర సంబంధాలను విస్తరించడం అత్యవసరమని తెలిపారు. కొరియా సినిమా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో కొరియన్ సినిమా ప్రతిభను, సాంస్కృతిక వైవిధ్యాన్ని భారతదేశ ప్రజలు విపరీతంగా ఆదరిస్తున్నారని తెలిపారు. భావోద్వేగ ప్రధానమైన డ్రామాలు, యాక్షన్ థ్రిల్లర్లు, హాస్య చిత్రాలు, కుటుంబమంతా చూసే వినోదాత్మక సినిమాలు మాత్రమే కాకుండా, కొరియా సమాజం, సంస్కృతి, జీవన శైలి, విలువలను కూడా ప్రతిబింబిస్తాయని వివరించారు. కొరియన్ సంస్కృతి ప్రత్యేకతలైన కే పాప్, కే డ్రామా, కే ఫుడ్, కే కాస్మటిక్ వంటి వాటిని విద్యార్థులతో పంచుకున్నారు. కొరియన్ సినిమాల వైశిష్ట్యాన్ని ఆస్వాదిస్తూ, రెండు సంస్కృతుల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలపరచడానికి ఈ ఫెస్టివల్ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ ఫెస్టివల్‌లో కొరియా సంస్కృతి, సినిమాలు విద్యార్థులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ప్రతిభకు ఉపకారం

- ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుకు ఈనెల 30 వరకు గడువు
- డిసెంబర్ 7న రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ సాయం
- పరీక్షలో ప్రతిభ చూపితే 9వ తరగతి నుంచి సీనియర్ ఇంటర్ వరకు ఏడాదికి రూ.12వేలు మంజూరు



గుంటూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతిభే కొలమానంగా ఉపకార వేతనాలు దక్కనున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి, వారికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు కేంద్ర ప్రభుత్వం ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలు మంజూరు చేస్తోంది. ఇందు కోసం ఏటా జాతీయ ప్రతిభా ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తోంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, ఏపీ మోడల్ స్కూల్స్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. పరీక్షలో ప్రతిభ చూపడం ద్వారా వరుసగా 9,10,11,12వ తరగతుల్లో ఏడాదికి రూ.12వేలు చొప్పున ఉపకార వేతనం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది. డిసెంబర్ 7న రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పరీక్ష జరగనుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏటా 450 మంది విద్యార్థులు ఎంపికవుతున్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు అర్హతలు

- పరీక్ష రాసేందుకు విద్యార్థినీ, విద్యార్థులు 2025–26 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ యాజమాన్యంలోని పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ ఉండాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3.50 లక్షలకు మించరాదు.
- విద్యార్థులు ఈనెల 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. పరీక్ష ఫీజు కింద ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 చొప్పున చెల్లించాలి. ఇందుకు సంబంధించిన యూజర్ మాన్యువల్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌లో ఉంది.

పరీక్ష విధానం

- నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష జాతీయస్థాయిలో జరుగుతుంది. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులకు ఉపకార వేతనం మంజూరవుతుంది.
- మెంటల్ ఎబిలిటీ (మాట్), ఆప్టిట్యూడ్ (శాట్) అంశాల్లో ఒక్కో పేపర్‌కు 90 మార్కుల చొప్పున పరీక్ష నిర్వహిస్తారు. 6,7,8 తరగతుల నుంచి ప్రశ్నలు వస్తాయి. 90 నిమిషాల్లో పరీక్ష జవాబులు రాయాల్సి ఉంటుంది.
- విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈనెల 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పరీక్ష రుసుంను ఆన్‌లైన్‌లో పొందుపర్చిన ఎస్‌బీఐ లింక్ ద్వారా చెల్లించాల్సి ఉంది.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జరిమానా

యద్దనపూడి: మద్యం తాగి వాహనం నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై రత్నకుమారి గురువారం తెలిపారు. యద్దనపూడి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపరచినట్లు తెలిపారు.

సెపక్‌తక్రా ఉమ్మడి జిల్లా జట్ల ఎంపికలు



ఎంపికైన జిల్లా జట్లతో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేష్‌కుమార్, పీఈటీలు

సత్తెనపల్లి: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్–14 , అండర్–17 బాల, బాలికల సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో గురువారం నిర్వహించారు. ఎంపికలకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి బాలబాలికల విభాగంలో 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. క్రీడా ఎంపికలు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎన్.సురేష్ కుమార్ పర్యవేక్షణలో జరిగాయి. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగబోయే 69వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ పోటీలలో పాల్గొంటారని సురేష్ కుమార్ తెలిపారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా పీఈటీలు లాకు పిచ్చయ్య, బి.అనిల్‌దత్తనాయక్, కోనంకి కిరణ్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఆదిత్య ఫిజికల్ ఎడ్యుకేషన్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ దాసరి కోటేశ్వరరావు, హెచ్ఎం కాకరపర్తి శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు గండు సాంబ శివరావు, కోనంకి కిరణ్‌కుమార్, జి.తులసీరామ్‌నాయక్, ఒ.రత్నాకర్, షేక్ మెహబూబి, కె.స్వాతి, సిహెచ్ అనూష పాల్గొన్నారు.

అండర్ –14 బాల బాలికల జట్లు..

అండర్–14 సెపక్‌తక్రా బాలుర జట్టుకు కె.రాము, టి.కళ్యాణ్‌బాబు, బి.రత్నాకర్, పి. సన్నీ, ఎస్.మహేష్, స్టాండ్ బైలుగా షేక్.నాగుర్‌వలి, ఎస్.వేణు, జి.పవన్‌కుమార్ ఎంపికయ్యారు. అండర్–14 బాలికల జట్టుకు పి.శ్రీ జర్షిని, కె.తిరుమలభార్గవి, కె.స్వరూప, కె.ప్రశాంతి, పి.వర్షిని స్టాండ్‌బైలుగా ఎ.వేదవతి, ఆర్.సిరివెన్నెల, కె.మాళవిక.

అండర్–17 బాలుర జట్టు

కె.శామ్యూల్ రాజు,ఆర్.సంతోష్ కుమార్, ఎం.ప్రభుదాస్, ఎం.శ్రీకాంత్, బి.మనిధర్, స్టాండ్ బైలుగా వి.సురేంద్ర, బి.అనీల్ కుమార్, ఎ.కిశోర్ ఎంపికయ్యారు.

అండర్ –17 బాలికల జట్టు

పి.గాయత్రి, కె.గీతిక, జి.చిన్మయి, డి.స్వరూప, షేక్. సమీర, స్టాండ్ బైలుగా ఎ.ప్రశాంతి, పి.దివ్యశ్రీ, జి.వర్ష

ఫార్మసీ ప్రవేశాలకు వేళాయే !

- ఏపీ ఈఏపీ సెట్–2025 బైపీసీ స్ట్రీమ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల
- ఈనెల 16 వరకు ఆన్‌లైన్‌లో కొనసాగనున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- నేటి నుంచి 17 వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 43 ఫార్మసీ కళాశాలలు



ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ ఈఏపీసెట్–2025)లో అర్హత సాధించిన విద్యార్థులు ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు రంగం సిద్ధమైంది. బైపీసీ స్ట్రీమ్‌లో అర్హత సాధించిన విద్యార్థుల మొదటి విడత ప్రవేశాలకు సంబంధించి రాష్ట్ర ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఆన్‌లైన్ ఆధారిత కౌన్సెలింగ్ జరగనుంది. అగ్రికల్చర్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్, బీ.ఫార్మసీ, ఫార్మాడీ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు ఈనెల 16వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌తో పాటు కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరు కావాల్సి ఉంది.

ఆన్‌లైన్‌లో కళాశాలల జాబితా

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 43 ఫార్మసీ కళాశాలలు ఉన్నాయి. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం విద్యార్థులు తమ ఇళ్లలోని పర్సనల్ కంప్యూటర్‌తో పాటు ప్రైవేటు ఇంటర్నెట్ కేంద్రాలు, ఫార్మసీ కళాశాలల నుంచి సహాయాన్ని పొందవచ్చు. అయితే, తమ ర్యాంకు, ఫీజు చెల్లించిన రసీదు వివరాలు, కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఆప్షన్ల నమోదుకు సంబంధించిన వివరాలను గోప్యంగా ఉంచుకోవాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో పొందుపర్చిన జాబితా నుంచి తాము చేరదలచుకున్న కళాశాలలను తల్లిదండ్రుల సమక్షంలో ప్రాధాన్యత క్రమంలో ఆప్షన్లు నమోదు చేసుకోవాలి.


ఫీజు చెల్లింపుతో మొదలయ్యే ప్రక్రియ

ఏపీ ఈఏపీసెట్–2025లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంది. ఎస్ఈఏపీఎస్.ఎస్‌సీహెచ్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌కు లాగిన్ అయ్యి క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ మార్గాల్లో చెల్లించాలి. ఏపీ ఈఏపీసెట్ డీటెయిల్డ్ నోటిఫికేషన్, యూజర్ మాన్యువల్, కళాశాలల జాబితా, విద్యార్థులకు మార్గదర్శకాలను ఇదే సైట్‌లో పొందుపర్చారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన విద్యార్థులు కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది.

దరఖాస్తు సమయంలోనే పూర్తయిన సర్టిఫికెట్ల పరిశీలన

ర్యాంకులు సాధించిన విద్యార్థులు హెల్ప్‌లైన్ కేంద్రాలకు విధిగా వెళ్లాల్సిన అవసరం లేదు. దరఖాస్తు సమయంలోనే సమర్పించిన టెన్త్, ఇంటర్ మార్కుల జాబితాలు, సామాజికవర్గ, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఆన్‌లైన్‌లో పూర్తి చేశారు. అసంపూర్తిగా ఉన్న విద్యార్థులు వాటిని కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపించే సూచనల ఆధారంగా తిరిగి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వీటిని సమీపంలోని హెల్ప్‌లైన్ కేంద్రంలో పరిశీలన చేసి, అన్నీ సక్రమంగా ఉంటే ఆమోదిస్తారు. దీంతో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తవుతుంది. అనంతరం విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. గుంటూరు శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

పోరాటాలతోనే ఐసీడీఎస్ పరిరక్షణ



సమావేశంలో సుబ్బరావమ్మ

లక్ష్మీపురం: సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం (ఐసీడీఎస్) పరిరక్షణకు అంగన్‌వాడీలు పోరాటాలకు సిద్ధం కావాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా 10వ మహాసభను గురువారం పాత గుంటూరు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు అవుతుందని, ఈ కాలంలో ప్రభుత్వాలు ఈ స్కీంను నిర్వీర్యం చేయటానికి అనేక ప్రయత్నాలు చేశాయని తెలిపారు. దేశంలో ఆకలి చావులు పెరుగుతున్నా బలోపేతం చేయటానికి చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. ఏటా బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తోందని, బిల్లులు సకాలంలో విడుదల చేయట్లేదని చెప్పారు. అంగన్‌వాడీలకు కనీస వేతనాలు కూడా ఇవ్వట్లేదని తెలిపారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రధాని మోదీ అంగన్‌వాడీల వేతనాలు పెంచుతామని, ఐసీడీఎస్‌ను బలోపేతం చేస్తామని వాగ్దానం చేశారని ఆమె గుర్తు చేశారు. మూడుసార్లు అధికారంలోకి వచ్చినా చిల్లిగవ్వ పెంచలేదని, పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించారని విమర్శించారు. ఇప్పటికైనా ఈ పథకం బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎ.వి.ఎస్.కుమారి, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.